# న్యాల్‌కల్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

**న్యాల్‌కల్, మార్చి 19, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం తెలుగు నూతన సంవత్సరం పరాభవ నామ సంవత్సరం (ఉగాది) వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూ శ్రీ సిద్ధివినాయక ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని ఆలయ అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో పచ్చడి, ప్రసాదాన్ని వితరణ చేశారు. మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో గిరీష్ మహారాజ్ పంచాంగశ్రవణం చేశారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ సొసైటీ మాజీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, మాజీ సర్పంచి పడకంటి శ్రీనివాస్, నాయకులు సతీష్‌కుల్‌కర్ణి, ప్రవీణ్‌కుమార్, సున్నపు సత్యనారాయణ, పాదొడ్డి శివరాజ్, మున్నూర్ అశోక్, నర్సింహారెడ్డి, బక్కారెడ్డి, రాంచందర్ పవార్, బిజిలీపూర్ ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ తీసుకువచ్చిన ఘనత బిఆర్ఎస్‌దే

**-బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు చంద్రయ్య, మల్లిఖార్జున్‌రెడ్డి**

**హుస్నాబాద్ రూరల్, మార్చి 19, ప్రభాతవార్త:**
సిద్దిపేటజిల్లా నర్మేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని తీసుకువచ్చిన ఘనత ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కూచనపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2021 మార్చి నెలలో ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.300 కోట్ల వ్యయంతో నర్మేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని, మాజీ మంత్రి హరీష్ రావు కృషివలన ఫ్యాక్టరీ నిర్మాణపనులు వేగంగా ముందుకు సాగాయని అన్నారు. సిద్దిపేట ప్రాంతంలో రైతులను ప్రోత్సహించి దాదాపు 12వేల ఎకరాల్లో పంటను సాగుచేయించామని, దీనిద్వారా ఎకరానికి దాదాపు లక్షల ఆదాయంవస్తుందని, వందలాదిమందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషిచేసిన హరీష్‌రావుకు హుస్నాబాద్‌ప్రాంత ప్రజలతరపున కృతజ్ఞతలు తెలిపారు.

# ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ఉగాది వేడుకలు



కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో ఉగాది పర్వదినాన్ని గురువారం ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని సేవించి రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగించాలని ఇష్టదైవాలకు పూజలుచేశారు. పండగరోజు పలు దేవాలయాలు కిటకిటలాడాయి. దేవాలయాల్లో వేదపండితులు పంచాంగాన్ని పఠించారు. వేంకటేశ్వర స్వామి, కోటిలింగాల దేవాలయాలతో పాటు వివిధ ఆలయాల్లో పంచాంగపఠనం గావించారు.

**కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో...**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా పంచాంగశ్రవణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, పూజల హరికృష్ణ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపరాభవనామ సంవత్సరంలో రాష్ట్రంతోపాటు దేశం మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందాలని రాబోయే రోజుల్లో పేదప్రజలకు మరిన్ని సంక్షేమపథకాలు అమలుచేసేలా ప్రభుత్వానికి బలం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖఃసంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండి.ఇమామ్(అత్తు), బొమ్మల యాదగిరి, కలీం, ఎల్లం యాదవ్, మీసం మహేందర్‌యాదవ్, రాజ బహదూర్‌రెడ్డి, ఎర్ర మహేందర్, ముద్దం లక్ష్మి, గాయజుద్దీన్, రాజు, పద్మ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని సత్కరించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు

**నంగునూర్, మార్చి 19, ప్రభాతవార్త:**
నంగునూర్ మండలపరిధిలోని నర్మెటలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ఈనెల 22న సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభంకానుండడంతో సిఎం సభ ఏర్పాట్ల పరిశీలనతోపాటు రైతుమేళా కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును గురువారం సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.ఇమామ్(అత్తు) మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఎండి.ఇమామ్(అత్తు)ను ఆప్యాయంగా పలకరించారు. ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేసేలా కృషిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించినట్లు అత్తు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గయాజుద్దీన్, తప్పట శంకర్, విజయ డానియల్, ఆత్మరాములు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేసిన హరీష్‌రావు



వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదు, రైతుభరోసా రాలేదు, వడగళ్ల పరిహారం అందలేదు, పంటల బీమా పక్కన పెట్టారు. మరెందుకు ఈ రైతు ఉత్సవాలు? వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి రైతులకు న్యాయం చేయాలని దేవుళ్లమీద ప్రమాణం చేసిన మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు గురువారం సిద్దిపేట పర్యటనకు విచ్చేసిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, డాక్టర్ యాదవరెడ్డిలతో కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు ఉత్సవాలకు వేదికగా ఎంచుకున్న నర్మెటగ్రామంలో రైతులు నిరుత్సాహంతో ఉన్నారని పేర్కొన్నారు. నర్మెటలో 725 మంది రైతులు ఉండగా సగంమందికి రుణమాఫీ కాలేదన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22,849 మంది రైతులకు దాదాపు రూ.300 కోట్ల పైచిలుకు రుణమాఫీ నగదు జమకావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న రైతుల సంఖ్య లక్షల్లో ఉందని వినతిపత్రంలో వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ ఒకే విడతలో చేస్తానన్న సిఎం మాట నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీ ప్రకారం పంటల బీమా పథకం అమలుచేయాలని అకాల, అధిక వర్షాలతో, వడగళ్ల వానలతో దెబ్బతిన్న పంటల ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందడం లేదన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో గతయేడాది 6,785 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిని రూ.6 కోట్ల నష్టం జరిగిందని నష్టపరిహారం చెల్లించడంలో మొండిచేయి చూపిస్తున్నారని వినతిలో వివరించారు.

# ఆలయాల్లో పంచాంగ శ్రవణం

**అల్లాదుర్గం, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన అల్లాదుర్గంతోపాటు మండలపరిధిలోని ఆయాగ్రామాల్లో గురువారం ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. ఆయాగ్రామాల్లోని ఆలయాల్లో వేదబ్రాహ్మణులు పంచాంగ శ్రవణం చేశారు. రాశిఫలాల ఆధారంగా ప్రజల భవిష్యత్తును వినిపించారు. అల్లాదుర్గంలోని మార్కండేయ ఆలయంలో అర్చకులు శ్రీలం కోటనారాయణ ఉగాదిశ్రవణం చేశారు. ఆలయాలకు చేరుకున్న భక్తులకు ఉగాది పచ్చడిని అందచేశారు. గ్రామంలోని మార్కండేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

# క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలు

## పంచాంగ శ్రవణం నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



క్యాంప్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 19, ప్రభాతవార్త:**
హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం శ్రీపరాభవ నామ నూతన తెలుగు సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పూజాకార్యక్రమాలు, పంచాంగశ్రవణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం అందరికీ శుభంగా ఉండాలని, సర్వేజనాః సుఖినోభవంతు అనేభావంతో ప్రజలందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పరాభవం అనే పేరుతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, శివపార్వతుల ఆశీర్వాదం ఎప్పటికీ ప్రజలపై ఉంటుందని అన్నారు. మనలో కోపం, అహంకారం, ఆవేశం, ఆక్రోశం, ఈర్ష్య, అసూయలను తొలగిస్తే సమాజంలో సంతోషం నెలకొంటుందని, తానూ కోపం రాకుండా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రానికి మరింత అభివృద్ధి జరగాలని, అందులో హుస్నాబాద్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష నాయకులు కూడా అభివృద్ధికి సహకరించి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో దేవాలయాల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉగాది షడ్రుచుల పచ్చడి మాదిరిగా ప్రతి మనిషి జీవితంలో తీపి, చేదు, పులుపు, వగరు అన్నీ కలగలిపి ఉంటాయని, అందరూ ధైర్యంగా జీవించాలని కోరుతూ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, మార్కెట్‌కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ బంక చందు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**మరకత లింగేశ్వర స్వామి దేవాలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్...**
పట్టణంలోని మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను హుస్నాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పంచాంగశ్రవణం కార్యక్రమంలో పాల్గొని కొత్త సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను శ్రద్ధగా వినిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

# రైతు మహోత్సవంలో పోటా పోటీ నినాదాలు

**-కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి**
**-హరీష్‌రావు, పొన్నం జోక్యంతో సద్దుమణిగిన రగడ**



పోటా పోటీగా నినాదాలు చేస్తున్న దృశ్యం

**నంగునూర్, మార్చి 19, ప్రభాతవార్త:**
నంగునూర్ మండల పరిధిలోని నర్మెట గ్రామంలోని ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఆవరణలో మూడురోజుల పాటు నిర్వహించ తలపెట్టిన రైతుమేళా మహోత్సవ కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభా కర్‌గౌడ్, వాకటి శ్రీహరి, గడ్డం వివేక్ వెంకట స్వామి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు లతోకలిసి ప్రారంభించారు. సభాప్రాంగణంలోకి హరీష్‌రావు అడుగు పెట్టగానే బిఆర్ఎస్ శ్రేణులు ఆయనకు అనుకూలంగా పెద్దయెత్తున నినాదాలు చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు తమ తమ నేతలకు అనుకూలంగా నినాదాలు హోరెత్తించారు. కాగా రైతుమేళా మహోత్సవం కార్యక్రమంలో స్టాళ్ల ఏర్పాటులో బిఆర్ఎస్ శ్రేణులు మంత్రి పొన్నంతో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇటు బిఆర్ఎస్ అటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దయెత్తున నినాదాలు చేయడంతో పాటు ఒక్కసారి సభావేదిక వద్ద తీవ్ర గందరగోళం చెలరేగి, ఇరు పార్టీల మధ్యన తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకున్నా, ఇరు పార్టీల శ్రేణులు పట్టించుకోకుండా పోటాపోటీన నినాదాలు చేశారు. ఇటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, అటు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లు కలుగజేసుకొని ఇరుపార్టీల నాయకులను సముదా యించడంతో గందరగోళ పరిస్థితి సద్దుమణిగింది. ఒకే వేదికపై బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనడం విశేషం.

# అట్టహాసంగా రైతు మేళా ప్రారంభం



రైతు స్టాళ్లను ప్రారంభిస్తున్న స్పీకర్ తదితరులు

**నంగునూర్, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని నర్మెట ఆయిల్‌పాంఫ్యాక్టరీ ఆవరణలో మూడురోజులపాటు నిర్వహించతలపెట్టిన రైతుమేళా మహోత్సవాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు నాగేశ్వర్ రావు, ప్రభాకర్‌గౌడ్, శ్రీహరి, గడ్డం వివేక్‌వెంకటస్వామి, మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుతోకలిసి ప్రారంభించారు. ఉగాదిసందర్భంగా నర్మెట అల్పా ఫ్యాక్టరీలో 150 స్టాళ్లను ఏర్పాటుచేశారు. స్టాళ్లను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి రైతులను తరలించేందుకు ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెదక్ ఎంపి రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, డాక్టర్ యాదవరెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, అయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# మండల విద్యాధికారి తీరే వేరు..

***కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్.. *రాత్రి లింక్ పెట్టి.. పొద్దున తీసేశారు...**
***5 రోజులు అవకాశమున్నా..14 గంటల్లో లింక్ క్లోజ్**
***జనగణన అవకాశం కోల్పోయిన టీచర్ల ఆవేదన**

**పాపన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:**
జనగణన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామక ప్రక్రియలో, మండల విద్యాశాఖాధికారి తొందరపాటు చర్యల వల్ల తాము అవకాశం కోల్పోయినట్లు పలువురు టీచర్లు వాపోయారు. ఆన్‌లైన్ గూగుల్ నమోదు కోసం రాత్రి లింక్ పెట్టి, పొద్దున తీసేయడంతో వలువురు సీనియర్ టీచర్లు జనగణనకు దూరమయ్యారు. అవకాశాలు కోల్పోయిన ఉపాధ్యాయులు మండల విద్యాధికారిని అడిగితే.. అంతా నా ఇష్టం, మీరెవరు అడగడానికి అన్నట్లు వ్యవహరించడంతో టీచర్లు ఎవరి వద్ద మొరపెట్టుకోవాలో అంతుపట్టని పరిస్థితిలో ఉన్నారు. జిల్లా జనగణన ప్రక్రియ కోసం 11 మే నుండి 9 జూన్ వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఇందు కోసం జిల్లాలో 1406 ఎన్యూమరేటర్లు, 248 సూపర్‌వైజర్లను నియమించాల్సి ఉంది. ఈ మేరకు సీనియారిటీ ప్రతిపాదికన స్కూల్ అసిస్టెంట్లను, ఎస్జీటి టీచర్లను నియామకం చేస్తారు. ఇందు కోసం గూగుల్‌లో ఓ లింకును పెట్టారు. ఔత్సాహికులైన టీచర్లు, నమోదు చేసుకుంటే, అందులో సీనియారిటీకి అనుగుణంగా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను ఎంపిక చేస్తారు. అయితే వేసవి సెలవుల్లో జనగణన సూపర్‌వైజర్ల పని పూర్తి చేస్తారు.

**రాత్రి లింక్..పొద్దున తొలగింపు..**
జిల్లా విద్యాశాఖాధికారి సూచన మేరకు ఈ నెల 12న ఆన్‌లైన్‌లో లింక్ పెట్టారు. ఈ నెల 16 లోగా తుది జాబితా జిల్లా కార్యాలయానికి పంపాల్సి ఉంది. కానీ పాపన్నపేట ఎంఇఓ ప్రతాప్‌రెడ్డి సూచనల మేరకు హెచ్‌ఎంలు, సిఆర్పీలు 12న రాత్రి 8 గంటల సమయంలో, వివిధ గ్రూపుల్లో లింక్ పెట్టారు. 13న ఉదయం 10.30 గంటల సమయంలో లింక్ తొలగించారు. దీంతో చాలామంది టీచర్లు రాత్రి సమయంలో లింక్ చూసుకోలేదని, పొద్దున తమకు సమాచారం అందే సరికే, లింక్ తొలగించారని వాపోయారు. మండలంలో 116 మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు అవసరముండగా, 130 వరకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో జూనియర్ టీచర్లకు జనగణన బాధ్యతలు అప్పగించగా, కొంతమంది సీనియర్ టీచర్లకు విధులు నిర్వహించే అవకాశం రాలేదని తెలిపారు, ఇతర మండలాల్లో మొదట సీనియారిటీ లిస్టు తయారుచేసి, అందుకు అనుగుణంగా, అర్హులైన టీచర్ల పేర్లను లింక్‌లో నమోదు చేశారని తెలిపారు. పాపన్నపేటలో ఇందుకు విరుద్ధంగా ఆన్‌లైన్ నమోదుకు ఈ నెల 16 వరకు అవకాశం ఉన్నప్పటికీ, మార్చి 13 ఉదయాన్నే క్లోజ్ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అర్హులైన సీనియర్ టీచర్లకు అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈవిషయమై ఎంఇఓ ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా, ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం కాబోతున్న తరుణంలో, తొందరగా, వివరాలు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ఈ నెల 13న లింక్ క్లోజ్ చేశామన్నారు.



పాపన్నపేట మండల వనరుల కేంద్రం దృశ్యం

**సమయమున్నా ఎందుకు తొందరపడ్డారు..?**
**-రమేష్, టివిటిఎఫ్ నాయకులు**
ఎంఇఓ తొందరపాటు చర్యల వల్ల వలువును అర్హులైన టీచర్లు జనగణనకు దూరమయ్యారు. ఈ నెల 16 వరకు ఆన్‌లైన్ ప్రక్రియ నమోదుకు అవకాశం ఉన్నప్పటికీ, 13వ తేదీన లింక్ ఎందుకు క్లోజ్ చేశారని ప్రశ్నించారు. టీచర్ల సీనియారిటీ జాబితా తయారుచేసి, వారి ఇష్టాన్ని పరిగణనలోకి తీసుకొని, ఆన్‌లైన్‌లో లిస్టు పంపితే బాగుండేదని అన్నారు. ఇతర మండలాల్లో ఇలాగే చేశారని చెప్పారు.

# ఉగాది వేడుకల్లో ప్రముఖులు

**రామచంద్రాపురం, మార్చి 19, ప్రభాతవార్త:**
ఓల్డ్ రామచంద్రాపురంలోని ఆంజనేయస్వామిదేవాలయంలో ఉగాదిని పురస్కరించుకుని ప్రముఖులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీసర్పంచి ఈశ్వర్‌రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శరెడ్డి, మాజీకార్పొరేటర్ తొంట అంజయ్య, పుష్పనగేష్, కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బలరాంరెడ్డి, బాలరాజ్, చంద్రశేఖర్, మురళీధర్‌రెడ్డి, చిగురు శ్రీను, రవిగౌడ్, భాస్కర్, జానీ, దిలీప్‌సింగ్, అమరేందర్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# కొండచిలువ దాడితో గొర్రె మృతి



కొండచిలువ దాడితో మృతి చెందిన గొర్రె దృశ్యం

**అక్కన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలంలోని కపూర్‌నాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలో గురువారం విషాదఘటన చోటుచేసుకుంది. గ్రామానికిచెందిన వెంకటేష్ గొర్రెలను మేపడానికి నందారం స్టేజి సమీపానికి వెళ్లగా, ఒక గొర్రె కనిపించకుండా పోయింది. దీంతో అనుమానం వచ్చి వెతకడానికి వెళ్లిన ఆయనకు, పొదల్లో ఒక పెద్ద కొండచిలువ గొర్రెను పట్టుకుని పీడిస్తున్న దృశ్యం కనిపించింది. కొద్ది సేపటిలోనే ఆ గొర్రె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనను గమనించిన పరిసర ప్రాంత గొర్రెల కాపరులు వెంటనే అక్కడికి చేరుకుని, ప్రమాదకరంగా మారిన కొండచిలువను హతమార్చినట్లు సమాచారం. ఈ సంఘటనతో ఆప్రాంతంలో భయం నెలకొంది. అటవీప్రాంతాలకు సమీపంలో గొర్రెలను మేపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

# గాలివానకు నేలమట్టమైన మొక్కజొన్న పంట



నేలమట్టమైన మొక్కజొన్న పంట దృశ్యం

**అక్కన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:**
అక్కన్నపేట మండలం కేశనాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోగల చెరువుముందు తండాకు చెందిన రైతు భానోత్ కిషన్ సాగుచేసిన మొక్కజొన్న పంట గాలివానకు నేలమట్టమైంది. తనకు ఉన్న మూడు ఎకరాల్లో అప్పు తెచ్చుకుని పెట్టుబడి పెట్టి పంట వేసినప్పటికీ, ఇటీవల కురిసిన గాలివానతో మొత్తం పంట నేలకు పడిపోవడంతో తీవ్రనష్టాన్ని చవిచూశాడు. పంట కోతకు సమీపిస్తున్న సమయంలో ఈవిధంగా నష్టం వాటిల్లడంతో గిట్టుబాటు లేక పోవడంతో రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవచ్చని ఆందోళన వ్యక్తంచేశాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి, తగిన నష్ట పరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు. స్థానిక అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి రైతులకు సహాయం అందించాలని గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఉగాది సందర్భంగా రవీంద్రభారతి వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఘనంగా ఉగాది సంబరం

### ఆకట్టుకున్న నృత్య విన్యాసం

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త**

శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను గురువారం నగర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాచంపల్లి సంతోష్‌కుమార్ పంచాంగ శ్రవణంచేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అలాగే నగరంలో పలు దేవాలయాల్లో, కమ్యూనిటీ హాళ్లల్లో వేదపండి తులు పంచాంగ శ్రవణం చేశారు.

# టిటిడి శ్రీవారి దేవాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

**సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:**

హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శ్రీపరాభవ నామ సంవ త్సరం ఉగాది పండువ వేడుకలు వైభవంగా జరి గాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని దర్శించు కుని తరించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఉగాది అస్థానంతోపాటు స్వామి వారికి అని ్న పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉగాదిని పుర స్కరించుకుని టిటిడి దేవాలయాన్ని పూలమాలలతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించింది. సాయంత్రం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వ ర్యంలో టిటిడి పంచాంగ శ్రవణం భాస్కర భట్ల ఆంజేయశర్మ చేశారు. ఆయన పంచాంగ శ్రవణం చేస్తూ తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములు తెలసుకోవడమే పంచంగాం అర్థమన్నారు. శ్రీవారిని భక్తితో సేవిస్తే అన్ని శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం ఆయా రాశుల వారికి ఈ సంవత్సరం లో కలిగే ఫలాలను తెలియజేశారు. అనంతరం ఆయన్ని దేవాలయం అర్చకులు ఘనంగా సత్కరిం చారు. భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాల వితర ణతోపాటు అన్నదానం జరిగింది. ఉగాది సందర్భం గా టిటిడి ముద్రించిన పంచాగాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదాల విక్రయం జరిగింది. టిటిడి ప్రత్యేక అధి కారి యు.రమేష్, అధికారి శ్రీనివాస్ మణికంఠ, శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

**లక్ష్మీగణపతి దేవాలయంలో...**

**చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# కోకాపేట శారదాపీఠంలో వైభవంగా ఉగాది వేడుకలు

**నార్సింగి, మార్చి 19 ప్రభాతవార్త :**

గండిపేట మండలం కోకాపేటలోని శ్రీశారదా పీఠంలో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. శారదా చంద్ర మౌళీశ్వర ఆరాధనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో చిర్రావూరి విజయనాథ్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం స్వరూపానందేంద్ర సరస్వతీ మాట్లాడుతూ దేశ క్షేమం కోసం నిత్యం శారదా పీఠంలో కైంకర్యాలు, ఆధ్యాత్మిక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని, తెలుగు ప్రజలు అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదిస్తున్నట్లు వివరించారు. హైందవ ధర్మంలో ఆచరించే ప్రతీ క్రతువు, పూజ, ఆచార, వ్యవహారాల వల్ల ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం పెరుగుతాయన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని వందలాది మంది భక్తజనులకు, వివిఐపిలకు పంపిణీ చేశారు. ఈ వేడుకలు భక్తులలో ఆధ్యాత్మిక స్ఫూర్తిని పెంచుతాయని తెలిపారు. ఈ వేడుకల్లో హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ రామకృష్ణారెడ్డి, పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఎన్‌సిఎల్‌టి న్యాయ సభ్యుడు సజ్జీస్ బద్రినాథ్, మాజీ న్యాయమూర్తి వెంకటరమణ, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌రావ్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, మాజీ డీజీపి అంజన్‌కుమార్, ఎపి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రుద్రరాజు, ప్రసిద్ధ గజల్ గాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### హాజరైన మాజీ గవర్నర్, హైకోర్టు న్యాయమూర్తులు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు న్యాయమూర్తులు



ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

# ఆస్తి పన్ను బకాయిదారులపై ప్రత్యేక డ్రైవ్

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త**

మార్చి 31 వరకు అవకాశం కల్పించిన వన్ టైమ్ స్కీమ్ (ఓటీఎస్) పథకం ద్వారా ఆస్తి పన్ను చెల్లించి పెనాల్టీ నుంచి ఉపశమనం పొందవచ్చని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.ఎంఎంసి పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారుల నుండి పన్ను వసూలు చేయడానికి రెవెన్యూ విభాగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఎంఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ రాధిక గుప్తా ఆధ్వర్యంలో ప్రతి సర్కిల్ నుండి ఇద్దరు ఉద్యోగులను ఎక్కువ బకాయిలు ఉన్న 100 ఆస్తి పన్ను బకాయిదారులను గుర్తించి వారికి ఫోన్ చేసి ఆస్తి పన్ను బకాయిలు సేకరించే కార్యక్రమం చేపట్టారు. ఆస్తి పన్ను వడ్డీపైన 90 శాతం రాయితీ మార్చి 31 వరకు మాత్రమే ఉంది అని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మార్చి 31 తర్వాత కూడా ఆస్తి పన్ను వసూలు డ్రైవ్ ఉంటుందని, కానీ అప్పుడు వడ్డీపై రాయితీ ఉండదన్నారు. గడువు ముగిసిన తర్వాత ఆస్తి పన్ను వడ్డీతో సహా కట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించడానికి పౌరులు కూడా సానుకూలంగా స్పందిస్తూ కొందరు వెంటనే కడతామని, మరికొందరు ఒక వారంలోపు కడతామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. ఆస్తి పన్ను వెబ్ సైట్ ద్వారా గాని మై క్యూర్ యాప్‌లో గానీ లేదా దగ్గరలోని మీసేవ,పౌర సేవా కేంద్రంలో చెల్లించవచ్చని తెలిపారు.

# పాతబస్తీలో ట్రాఫిక్ మళ్లింపు

**చార్మినార్, మార్చి 19 ప్రభాతవార్త :** రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం ప్రార్ధనలు సందర్భంగా ఈ నెల 20వ తేదీన చారిత్రక మక్కామసీదు, చార్మినార్ పరిసర ప్రాంతాలలో జరగనున్న ప్రార్ధనలు దృష్ట్యా ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించటం జరిగిందని పోలీసులు వెల్లడించారు. నయాపూల్ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను మదీనా జంక్షన్ వద్ద సిటీ కళాశాల వైపు మళ్లిస్తారు. శాలిబండ, నాలుగు చింత నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను హిమ్మత్‌పుర జంక్షన్ వద్ద హరిబౌలి, ఓల్గా హోటల్ ఖిల్వత్ వైపు మళ్లిస్తారు. చౌక్ మైదాన్ నుంచి వచ్చే వాహనాలను కోట్లా అలీజా లేదా మొఘల్ పుర వైపు,మూసాబౌలి నుంచి వచ్చే వాహనాలను మోతీగల్లీ వద్ద,రాజేష్ మెడికల్ శాలిబండ, ఫతేదర్వాజ రోడ్డు వైపు మళ్లిస్తారు. గుల్జారాహౌస్ వైపు వచ్చే వాహనాలను ఏతెబార్ వద్ద నుండి మీరాలం మార్కెట్ లేదా బిబి బజార్ వైపు, మిట్టికాషేర్ నుంచి గుల్జారాహౌస్ వైపువచ్చే వాహనాలను ఘాన్సీ బజార్ మీదుగా హైకోర్టు రహదారి,కిల్వత్ వైపు మళ్లించనున్నారు.లక్కడ్ కోట (పాత సీపీ ఆఫీస్ జంక్షన్) అవసరాన్ని బట్టి ఏపిటిపి నుంచి వచ్చే వాహనాలను మండి మీరాలం మార్కెట్ వైపు మళ్లిస్తారు. ఈ ఆంక్షలు ఆర్‌టిసి బస్సులకు కూడ వర్తిస్తాయి.సిటీ బస్సులు అఫ్జల్‌గంజ్ వద్ద నిలిపి వేయనున్నారు.జిల్లా బస్సులు చాదర్‌ఘాట్, సైదాబాద్, మిదానీ ప్రాంతీలు మీదుగా మళ్లించబడతాయి. కాగా పాతబస్తీలోని గుల్జారా ఫంక్షన్ హాల్, ముఫీద్ ఉల్ అనామ్ గ్రౌండ్, చార్మినార్ బస్ టెర్మినల్, ఏయుహోస్పటిల్ పార్కింగ్, ఖిల్వత్ గ్రౌండ్, పాత పెన్షన్ కార్యాలయం ప్రాంతాలలో వాహనాలను పార్కింగ్ చేయటానికి పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరగనున్న జుమాతుల్ విదా ప్రార్ధనలు సందర్భంగా చార్మినార్ జోన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.మక్కామసీదులో శుక్రవారం మధ్యాహ్నం మక్కామసీదు ఖతీబ్ అల్‌హాజ్ మహ్మద్ రిజ్వాన్‌ఖురేషీ ప్రార్ధనలు చేయిస్తారని మేనేజర్ తెలిపారు.

### కెటిఆర్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్

**సికింద్రాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సీతాఫల్‌మండి డివిజన్ మాజీ కార్పొరేటర్ డాక్టర్ సామలహేమ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావు గౌడ్‌ను కలిసి ఉగాది శుశాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగాది తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పర్వదినమని పేర్కొన్నారు. ఈ కొత్త సంవత్సరం అందరికీ సుఖ శాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

# కల్తీలతో నీరసమే

* కాలం చెల్లిన పదార్థాలు.. అస్తవ్యస్తంగా పరిస్థితులు
* బూజుపట్టిన పచ్చళ్లు.. కుళ్లిన చికెన్, కల్తీ పన్నీరు. .
* డ్రమ్ములకొద్ది అల్లం వెల్లుల్లి
* పాతబస్తీ అయినా.. ఐటీ కారిడార్ అయినా ఒక్కటే
* పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెల్లడి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :**

బయట ఏదైనా తినాలంటేనే కాదు.. తాగాలన్నా జడుసుకోవాల్సిన దుస్థితి నగరంలో నెలకొంది. కల్తీ పాలు, నూనె, అల్లం వెల్లుల్లి, పసుపు, కారం, చాయపత్త, పన్నీరు, చికెన్ ఇలా పలు రకాల ఆహార పదార్థాలను పలు రకాల రసాయనాలను ఉపయోగించి కల్తీ ఆహార పదార్థాలను తయారుచేసి సొమ్ము చేసుకుంటున్నారు.ఈజీగా మనీ సంపాదించుకునేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ విభాగం కొంతకాలంగా నిర్వహిస్తున్న తనికీల్లో స్టార్ హోటళ్ల నుంచి చిరుతిళ్ల దుకాణాల దాకా, బిర్యానీ సెంటర్ల నుంచి హోమ్‌ఫుడ్స్ దాకా, చికెన్ సెంటర్ల నుంచి స్వీట్ దుకాణాల దాకా..ఇలా అంతటా అధ్వాన్నపు పరిస్థితులే దర్శనమివ్వడం తెలిసిందే.

వేసవి ఎండలు ముదరడంతో ప్రజలు కూల్ డ్రింక్స్, జూస్ సెంటర్లను ఆశ్రయించడం తెలిసిందే. చల్లగా వాటిని తాగి ఉపశమనం పొందాలనుకునేవారు జడుసుకోవాల్సిన పరిస్థితి కనిపించాయి. తాజాగా గచ్చిబౌలిలో జూస్ సెంటర్లలో నిర్వహించిన తనిఖీల్లోనూ అవే దృశ్యాలు కనిపించాయి. అంతటా దర్శనమిచ్చినట్లే ముసురుకున్న ఈగలు, తిరుగుతున్న బొద్దింకలు ఒకచోట ఎలుకలు కనిపించాయి. ఫుడ్‌సేఫ్టీ ఆథారిటీ నుంచి లైసెన్సులు లేకపోవడం, సిబ్బందికి అప్రాన్లు, గ్లవ్స్, తలకు క్యాప్స్ లేకపోవడం చాలా చోట్లా మాదిరే అక్కడా లేవు. యాపిల్, నల్లద్రాక్ష, సపోటా, మామిడి, నారింజ, బత్తాయి తదితర పండ్లు చెడిపోయినవి కనిపించాయి. స్ట్రాబెర్రీ ఫ్లేవర్ సిరప్, ప్యాషన్ ఫ్రూట్ సిరప్ తదితరాలు గడువు ముగిసిన తేదీలనే ఉన్నాయి.

సికింద్రాబాద్, మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో వేల కిలోల్లో కల్తీ పన్నీరు బయటపడడంతో అధికారులతో సహా అంతా షాక్ అయ్యారు. రెండు వేల కిలోలకు పైగా కల్తీ పన్నీరును సీజ్ చేశారు ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. శ్రీబాలాజీ డైరి ప్రొడక్ట్స్, విజయ్ మిల్క్, కర్డ్ షాపుతో సహా ఆరు షాపులపై దాడులు చేశారు. శ్రీబాలాజీ డైరి ప్రొడక్ట్స్‌లో 1600 కిలోల పన్నీరును సీజ్ చేశారు. విజయ్ మిల్క్ అండ్ కర్డ్ షాపులో 1000 కిలోల కల్తీ పన్నీరు సీజ్‌చేశారు. నిర్వాహకులు నగరంలో పలు ప్రాంతాల్లో కల్తీ పన్నీరు అమ్ముతున్నట్లు గుర్తించారు.

ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ కుల్‌సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో కల్తీ పచ్చళ్లను తయారు చేస్తున్న గోదాంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రసాయనాల కోసం వినియోగించే ప్లాస్టిక్ డ్రమ్ముల్లో బూజుపట్టి ఉన్న 72 డ్రమ్ముల పచ్చళ్ల నిల్వలు, ఆరు డ్రమ్ముల టమాట, ఒక డ్రమ్ము అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కుల్సుంపురా పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులుగానీ, ఫుడ్‌సేఫ్టీ విభాగం నుంచి లైసెన్స్ గానీ లేకుండా అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో పచ్చళ్ల తయారీ, నిల్వలు చేస్తున్నట్లు గుర్తించారు.నిందితులు కుళ్లిపోయిన కూరగాయలు, నాణ్యతలేని మసాలాలు, కారంపొడి, నూనెలు, ఇతర ముడిపదార్థాలను ఉపయోగిస్తూ నాణ్యతలేని పచ్చళ్లను తయారు చేస్తున్నట్లు తేలింది. స్థానిక దుకాణాలకు తక్కువ ధరలకు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు నిందితుల విచారణలో స్పష్టమైంది.

ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ, నిల్వ ఉంచిన కుళ్లిన చికెన్‌ను విక్రయిస్తున్న ముషీరాబాద్‌లోని ఒక చికెన్ సెంటర్‌పై ఇటీవల వారసిగూడ పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాపూజీనగర్‌లోని ఏ1 ఫ్రెష్ చికెన్‌మార్ట్ యజమాని అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచిన ఫ్రోజన్ చికెన్‌ను స్థానిక ప్రజలకు, వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో చికెన్ సెంటర్‌పై ఆకస్మిక దాడి నిర్వహించి 610 కిలోల చికెన్ అత్యంత అపరిశుభ్రమైన స్థితిలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. నిల్వ ఉంచిన మాంసం పూర్తిగా కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రదేశంలో ఎలుకలు, పిల్లుల సంచారం ఉండటంతో మాంసం పూర్తిగా కలుషితమైంది. సదరు చికెన్ షాపు ట్రేడింగ్ లైసెన్స్ ఏడాది క్రితమే ముగిసినట్లు తేలింది. మానవ వినియోగానికి పనికిరాని ఈ కుళ్లిన మాంసాన్ని నిందితుడు తెలిసి కూడా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**నిబంధనలు అలా ఉన్నాయి...**

తనిఖీల సందర్భంగా పలు లోపాలు వెల్లడైనా, ప్రజల ఆరోగ్య రక్షణ లేకపోయినా, నిర్వాహకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకునేలా చట్టం, నిబంధనలు లేకపోవడంతో ఇందుకు కారణమని జిహెచ్‌ఎంసి వర్గాలు చెబుతున్నాయి. దానికి తోడు ల్యాబ్ పరీక్షల ఫలితాలు రావడానికి ఎంతో సమయం పడుతోంది. ప్రస్తుతం శాంపిల్స్ పరీక్షలకు ఒకే ఒక్క ల్యాబ్ ఉంది. అది కేవలం నగరానికేకాక రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన శ్యాంపిల్స్ అక్కడికే వస్తాయి. ఈ నేపథ్యంలో నగరంలోని జిహెచ్‌ఎంసి, ఎంఎంసి, సిఎంసి మున్సిపల్ కార్పొరేషన్లకు రెండు చొప్పున ఆరు ల్యాబ్‌లు ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. చర్యలు వేగిరం తీసుకునేందుకు అవసరమైతే నిబంధనలు మార్చాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



అల్లం



పన్నీరు



చెట్నీ

# హోటల్ బిల్లుల్లో 'గ్యాస్ ఛార్జీ'..!

* వినియోగదారుల అసహనం!
* ముందస్తు సమాచారం లేకుండానే అదనపు ఛార్జీలు
* బిల్లుకు రూ. 20 నుంచి రూ. 30 వరకు భారం

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త**

నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో టిఫిన్ చేసినా, భోజనం చేసినా బిల్లు చూసి కస్టమర్లు బెంబేలెత్తిపోతున్నారు.ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతుంటే, తాజాగా 'గ్యాస్‌ఛార్జీ' పేరుతో అదనపు వడ్డన మొదలైంది. ఒక్కో బిల్లుపై రూ. 20 నుంచి రూ. 30 వరకు అదనంగా వసూలు చేయడం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది. నగరంలోని అమీర్‌పేట, బంజారాహిల్స్, చిక్కడపల్లి, కాచిగూడ, బోడుప్పల్ వంటి ప్రాంతాల్లోని చిన్న, మధ్యతరహా హోటళ్లలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. మెనూ కార్డులో ధరలు యథాతథంగానే ఉంచి, బిల్లు చివరలో గ్యాస్ ఛార్జీ అని కొత్త కాలమ్‌ను చేరుస్తున్నారు. ఆర్డర్ ఇచ్చే సమయంలో ఈ విషయం చెప్పకపోవడంతో, బిల్లు చేతికి వచ్చాక కస్టమర్లు హోటల్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు. వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని హోటల్ యజమానులు చెబుతున్నారు. "మెనూ ధరలు పెంచితే కస్టమర్లు తగ్గిపోయే ప్రమాదం ఉంది, అందుకే తాత్కాలికంగా ఈ సర్ ఛార్జీని విధిస్తున్నాం" అని అమీర్‌పేటలోని ఒక రెస్టారెంట్ మేనేజర్ పేర్కొన్నారు. చాలా హోటళ్లలో మెనూ కార్డులో ఉన్న ధరలకే ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు కనిపిస్తున్నా, చివరకు బిల్లు ఇచ్చే సమయంలో మాత్రం అదనంగా రూ. 20 నుంచి రూ. 30 వరకు 'గ్యాస్ ఛార్జీ' అని వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు.. రూ. 79 విలువైన దోశ తింటే,దానికి అదనంగా రూ. 30 గ్యాస్‌ఛార్జీ కలిపి మొత్తం రూ.109 వసూలు చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఆర్డర్ ఇచ్చే సమయంలో ఈ విషయం చెప్పకపోవడంతో కస్టమర్లు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు.. ధరల భారం తగ్గించుకోవడానికి కొన్ని హోటళ్లు ఆహార పదార్థాల పరిమాణాన్ని తగ్గిస్తున్నాయి. గ్యాస్ ఖర్చును తగ్గించుకోవడానికి ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంపై యాజమాన్యాలు దృష్టి సారిస్తున్నాయి. ఏదైనా అదనపు ఛార్జీ ఉంటే ముందే స్పష్టంగా చెప్పాలని లేదా మెనూ ధరల్లోనే చేర్చాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. హోటళ్లు ఏ రకమైన అదనపు ఛార్జీలు వసూలు చేసినా, అది వినియోగదారుడికి ముందే తెలిసి ఉండాలి.ప్రభుత్వం లేదా పౌరసరఫరాల శాఖ ఇలాంటి అడ్డగోలు వసూళ్లపై దృష్టి సారించి, వినియోగదారులకు రక్షణ కల్పించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ఏదిఏమైనా, సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్న ఈ గ్యాస్ సెగపై పౌర సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు స్పందించి ఈ అదనపు ఛార్జీలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.



# ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

### మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి కృష్ణ




మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

**సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** రాజ్యాంగానికి విరుద్దంగా, 2011 జనాభా లెక్కలు ఆధారంగా ఏకసభ్య కమిషన్ ద్వారా ప్రభుత్వం చేసిన ఎస్సీ వర్గీకరణ మాలలకు విద్యను శాశ్వతంగా దక్కనీయకుండా ప్రభుత్వం దారుణంగా ద్రోహం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మాలలకు జరిగిన అన్యాయాలపై చర్చించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో 300 స్థానాలకు మాలలును నిలబెట్ట కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలు అధిక జనాభా ఉన్నందున వర్గీకరణలో 2వ గ్రూపులో మాలలు చేర్చుతూ 9 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ, రోస్టర్ పాయింట్లు 2, 16, 27, 47, 52, 66, 72, 87, 97లను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వినయ్‌కుమార్, అరుణ్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

# అమ్మ దర్శనానికి తరలి వచ్చిన భక్తులు

**బేగంపేట, మార్చి 19 ప్రభాతవార్త :**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహ ంకాళీ అమ్మ వారి దేవాలయానికి ఉగాది పర్వదినం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.శ్రీ పరాభవ నామ సంవత్సరం అమ్మ వారు తమ కుటుంబాల్లో నూతన వెలుగులు నింపాలని భక్తులు అమ్మ వారిని వేడుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మ వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో దర్శనం చేసుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఉగాది పచ్చడి పంపిణీ చేసారు. ఉగాది రోజున అమ్మ వారి ఆలయం భక్తులతో కిటకిట లాడింది.అమ్మవారి ఆలయంతో పాటు అద్దాల మండపాన్ని వివిధ రకాలైన పూలతో సుందరంగా అలంకరించారు.

### రూ. 5 కోట్లు ఇస్తామని..

# రూ. 15 లక్షలు కాజేశారు

**జూబ్లీహిల్స్, మార్చి 19, ప్రభాతవార్త**

రూ. 5 కోట్ల ఆర్థిక సాయం అందిస్తామని నమ్మించి రూ. 15 లక్షలు కాజేసిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మొహమ్మద్ ఆసిఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సూరజ్ తివారి అనే వ్యక్తి ఆసిఫ్‌ను సంప్రదించి అతని సంస్థకు ఆర్థిక సహాయం అందిస్తామని నమ్మబలికాడు. ఈ క్రమంలో ఆయన ప్రతినిధులు ముంబైకి వెళ్లగా, అక్కడ నిందితులు మరి కొందరితో కలిసి హైదరాబాద్‌కు రావాలని సూచించారు. తర్వాత హైదరాబాద్‌లో సమావేశమైన నిందితులు రూ. 5 కోట్ల సహాయం అందిస్తామని చెప్పి ముందుగా రూ. 15 లక్షలు డొనేషన్‌గా ఇవ్వాలని కోరారు. వారి మాటలను నమ్మిన ఆసిఫ్, ముకేష్ ట్రేడర్స్ పేరిట ఉన్న బ్యాంక్ ఖాతాకు ఆర్టీజీఎస్ ద్వారా రూ. 15 లక్షలు బదిలీ చేశాడు. డబ్బులు తీసుకున్న తర్వాత నిందితులు రూ. 5 కోట్లు ఇవ్వకుండా కాలయాపన చేశారు. దీంతో తమను మోసగిస్తున్నారని గ్రహించి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని..స్కూటరిస్టు మృతి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :**

అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. వేగంగా వచ్చిన బస్సు వెనుకనుంచి స్కూటర్‌ను ఢీకొట్టడంతో స్కూటరిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలోని మోహదీపట్నంలో గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే..మెహదీపట్నం డిపోకు చెందిన మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టింది. బస్సు ముందు వెళ్తున్న స్కూటర్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టడంతో స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తి కిందపడిపోయాడు. అతని తలపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో స్పాట్‌లోనే చనిపోయారు. మొయినాబాద్ తాజ్ హోటల్ సమీపంలో బీజాపూర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్కూటరిస్టు

# నవ వసంతం

## ఆలయాలు శోభితం



కడ్మూరు హనుమాన్ మందిరంలో..



కొడంగల్ ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు



చీర్యాలలో లక్ష్మీనరసింహ స్వామికి ఉగాది పచ్చడి కుండను సమర్పించడానికి వెళుతున్న ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ

**పల్లెలు..పట్టణాలలో ఘనంగా ఉగాది వేడుకలు**

**ఉదయం నుంచే ప్రత్యేక పూజలు**

**పంచాంగ శ్రవణాలతో అలరించిన పండితులు**



మాడ్గులలో పంచాంగ పఠన దృశ్యం

**వార్త నెట్‌వర్క్, మార్చి 19, ప్రభాతవార్త :** పల్లెలు, పట్టణాలు గురువారం ఉగాది శోభను సంతరిం చుకున్నాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. ఆయా దేవాలయాలలో ప్రత్యేక పూ జలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పోచారం శ్రీ స్ఫటిక లింగేశ్వరాలయం, ఇస్మాయిల్ ఖాన్‌గూడలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయం, అన్నో జిగూడలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో, శ్రీ గాయత్రి దేవి ఆలయంలో, శ్రీ జగదంబ మాత శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో, కొర్రెముల, ప్రతాప సింగారం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్ర మాన్ని ఆసక్తిగా భక్తులు తిలకించారు. ఇస్మా యిల్ ఖాన్‌గూడలోని ఆలయంలో జిల్లా బీజేపీ ఉపా ధ్యక్షుడు గొంగళ్ల బాలేశ్ కురుమ, అన్నోజిగూడలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న నర్సింహులు గౌడ్, స్థానిక నాయకులు బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, కేఎం. రెడ్డి, జితేందర్ నాయక్, బి. వెంకటేశ్ శ్రీ సంత్‌సేవాలాల్ ఆలయంలో బీజేపీ జాతీయ నాయకుడు నానావత్ బిక్కునాథ్ నాయక్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్ తదితరులు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. మండల పరిధిలోని అన్నారం, హస్నాబాద్, రుద్రారం, పెదనందిగామ, అంగడిరైచూర్, పర్సా పూర్, అప్పాయిపల్లి, రావులపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కీసర మండలం చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి ఆలయంలోని ఉగాది వేడుకలలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ పాల్గొని స్వామి వారికి పచ్చడి కుండను సమర్పించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాదాన్ని వితరణ చేశారు. మాడ్గుల మండలంలోని గ్రామాలు, పట్టణాల్లో ఉగాది పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రజలు నూతన వస్త్రాలను ధరించి ఆలయాలకు తరలి వెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూడూరు మండలంలోని దేవాలయాలు కిటకిటలాడాయి. మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, గౌడవెల్లి, డబిల్‌పూర్, ఎల్లంపేట, నూతన్‌కల్, రావల్ కోల్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా, పూడూర్ తదితర గ్రామాలలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. కోట్‌పల్లితో పాటు మోత్కుపల్లి, రాంపూర్, బార్వాద్, జిన్నారం, ఎన్నారం, ఎన్కెపల్లి, ఇందోల్, ఒగ్లాపూర్, తదితర గ్రామాలల్లో గురువారం సాయంత్రం హనుమాన్ మందిరం వద్ద ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి.



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న దృశ్యం



గురువారం మోహిని అవతారంలో భక్తులకు దర్శన మిచ్చిన శ్రీవారు

## మోహిని అవతారంలో..

### శ్రీవారి దర్శనం- కనుల పండువగా కొడంగల్‌లో బ్రహ్మోత్సవాలు

**కొడంగల్, మార్చి 19 ప్రభాతవార్త:** శ్రీవారి బ్రహ్మోత్స వాల్లో భాగంగా గురువారం ఉదయం నిర్వహించిన కార్యక్రమాలతో భక్తులు సమ్మోహితలయ్యారు. బ్రహ్మోత్స వం.. ఇది బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్స వం కనులార వీక్షించే..అంటూ కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున స్థానికులు పోటెత్తారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రీనివాసుడు పరమ శివుడిని సైతం మాయకు గురి చేసిన మోహిని అవతారంలో శ్రీవెంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కైంకర్యాలు పూర్తియిన అనంతరం వాహనసేవ అంగరంగ వైభవంగా కొనసాగింది. మలయప్పస్వామి, శ్రీకృష్ణ స్వాములు, అర్చక స్వాములు టీటీడీ అర్చకులు బాలాజీ విశేష సమర్పణలు చేశారు. స్వామివారు ఊరేగే వాహనాన్ని ముస్తాబు చేసి స్వామివారిని జగన్మోహిని రూపంలో తీర్చిదిద్దారు. మెడలో పుష్పమాలలు ధరించి శ్రీగంట చూపులతో మహిళలు సైతం కళ్ళార్పకుండా చూసేంత అందంగా స్వామి విశ్వమోహిని అవతారంలో పల్లకిలో ఆసీనులై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవస్థానం నుంచి స్వామివారిని బాలాజీనగర్ మాడ వీధుల మీదుగా ఊరేగింపుతో మోహిని అవతార వాహన సేవ ప్రారంభమైంది. అనంతరం స్వామివారు కల్పవృక్ష వాహనంలో ఊరేగుతుండగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మహామంగళహారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళలో వేంకటేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. అనంతరం రాత్రి వేళలో స్వామివారిని సర్వభూపాల వాహనంపై దేవాలయం నుంచి జాతర స్థలం వరకు ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## పెద్ద చెరువులో కెమికల్ ?

**- నిజాం కాలం నాటి జలాశయానికి గ్రహణం**

**- అధిక లాభాల కోసం చేపల మేతలో రసాయనాలు కలిపేందుకు రంగం సిద్ధం**

**- గట్టుపై నిల్వ ఉన్న టన్నుల కొద్దీ రసాయనాల మిశ్రమం**

**- ఎపి నుండి రహస్యంగా దిగుమతి ?**

**ఇబ్రహీంపట్నం, మార్చి 19, ప్రభాతవార్త :** ఎంతో చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్న ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నేడు స్వార్థపరుల చేతిలో చిక్కి శవాల దిబ్బగా మారే ప్రమాదం పొంచి ఉంది. సుమారు 1,300 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండి, వేలాది ఎకరాలకు సాగునీరు, వందలాది మూగజీవాలకు దాహార్తిని తీర్చే ఈ జలాశయం ఇప్పుడు రసాయన వ్యర్థాల ప్రయోగశాలగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం చేపల బరువును అడ్డదారిలో పెంచి, అతి తక్కువ కాలంలోనే లక్షలు గడించాలన్న కొందరు మత్స్య సంఘం నేతల దురాశకు ఈ జలాశయం బలైపోతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నాడు చరిత్ర ఘనం.. నేడు విషతుల్యం?**

ఇబ్రహీం కుతుబ్ షా నిర్మించిన ఈ చెరువు ఎందరో రాజుల కాలం నుండి ఈ ప్రాంతానికి గుండెకాయలా నిలిచింది. పచ్చని పంటలకు ప్రాణాధారమైన ఈ నీటిలో ఇప్పుడు విషం కలిపేందుకు కుట్ర జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. సహజసిద్ధమైన మేతకు బదులు చేపలు విపరీతంగా పెరగడానికి ప్రాణాంతక రసాయనాలను నీటిలో కలిపేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారని చెబుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ప్రాంతం నుండి రహస్యంగా కెమికల్స్ తెచ్చారని, అవి ఎవరి కంట పడకుండా ఉంచారని ఇబ్రహీంపట్నం ఆరోపిస్తున్నారు. ఈ రసాయనాలు చేపల శరీరాన్ని కృత్రిమంగా ఉబ్బేలా చేస్తాయి తప్ప వాటి ఆరోగ్యానికి ఏమాత్రం క్షేమకరం కాదని పేర్కొంటున్నారు.





చేపల బరువు పెరగటానికి తయారు చేస్తున్న మిశ్రమం

**అనుమతులు ఎవరిచ్చారు?**

ప్రభుత్వానికి చెందిన ఈ జలాశయంలో ఇలాంటి అక్రమ తతంగం బహిరంగంగా సాగుతున్నా.. ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలు ప్రభుత్వ చెరువులో ఇలాంటి రసాయనాలు కలపడానికి అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రజలు నిలదీస్తున్నారు. అధికారుల కళ్ళ ముందే టన్నుల కొద్దీ పశువుల పేడ, యూరియా, మానవాళికి హానికరమైన ఇతర కెమికల్స్ వచ్చి చేరుతున్నా.. కనీసం తనిఖీలు చేయకపోవడం వెనుక భారీ స్థాయిలో అవినీతి జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ముంచుకొస్తున్న ముప్పు**

చెరువులో రసాయనాల వినియోగంతో చేపల బరువు పెరిగి మత్స్యకారులకు వాటి ద్వారా అధిక లాభాలు గడించవచ్చు. కానీ... ఆ నీటిని తాగే పశువులకు, ఇతర త్రా ప్రాణులకు, ఆ నీటితో పండే పంటలకు మారీ ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రసాయనాలను భూగర్భ జలాలను కలుషితం చేయడం ద్వారా చుట్టుపక్కల గ్రామాల్లోని బోరు బావుల నీరు కూడా విషతుల్యం అవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరి స్వార్థం కోసం జరుగుతున్న ఈ విష ప్రయోగం పర్యావరణంపై గొడ్డలి పెట్టుగా మారుతుందని పేర్కొంటున్నారు.

**కెమికల్స్ కలిపితే సహించం**

**జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ**

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోని చేపల్లో ఇటీవల శంకుపూత, ఎర్రమచ్చ వంటి వ్యాధులను గుర్తించాం. చేప పిల్లలు ఇటువంటి వ్యాధుల బారిన పడి చని పోకుండా ఉండాలంటే నీటిలోని పోషక విలువల పారా మీటర్లను పెంచాల్సి ఉంటుంది. అందులో భాగం గానే పశువుల పేడ, యూరియా, పల్లి చెక్క, బెల్లం, ఈస్ట్ కలిపి మేతగా అందిస్తున్నాం. ఇది మత్స్య శాఖలో పూర్తి గా శాస్త్రీయంగా, ఎకో్ఫ్రెండ్లీ పద్ధతిలో చేపట్టే సాధా రణ ప్రక్రియే. దీనికి భిన్నంగా కెమికల్స్‌ను కలిపితే చర్యలు తీసుకుంటాం.

**చట్టపరమైన చర్యలు తప్పవు**

**- ఇరిగేషన్ ఎఈ స్టాలిన్**

అనుమతులు లేకుండా చెరువు నీటిని కలుషితం చేయడానికి వీలులేదు.

స్థానికుల ఆరోపణపై విచారణ చేపట్టి.. కలుషితం చేయడానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. చెరువును పరిశీలించి పోలీసులకు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.



వాగుల నుంచి ఇసుకను తవ్వి అడవిలో డంప్ చేసిన దృశ్యం

## వీరి నిర్లక్ష్యం... వారికి వరం

**ధారూర్, మార్చి 19, ప్రభాతవార్త:** అటవీ సంపదను కాపాడాల్సిన అధికారుల నిరక్ష్యం అక్రమార్కులకు వరంగా మారింది. ధారూర్ మండల పరిధిలోని అల్లాపూర్, రుద్రారం, నాగసమందర్ అటవీ ప్రాంతాల్లో ఇసుక మాఫియా పంజా విసురుతోంది. అడవిలో నుంచి రహస్యంగా దారి ఏర్పాటు చేసుకుని, ప్రభుత్వ సంపదను యథేచ్ఛగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అడవిలోకి ఎవరూ ప్రవేశించకుండా ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి ట్రెంచ్ (కందకాలు) తవ్వించినా, కేటుగాళ్ల తెలివితేటల ముందు అవి నిరుపయోగంగా మారుతున్నాయి. రాత్రి సమయంలో

**వాగులను గుల్ల చేస్తున్న అక్రమార్కులు**

**అటవీ మార్గంలో యథేచ్ఛగా ఇసుక రవాణా**

**అడవిలో ప్రవేశం లేకుండా లక్షలు ఖర్చు చేసి కందకాలను తవ్వించిన ప్రభుత్వం**

**రాత్రివేళ వాటిని మట్టితో పూడ్చివేసి మరీ వాహనాల ఎంట్రీ**

**అటవీ ప్రాంతాలనే డంపింగ్ యార్డులుగా మార్చిన మాఫియా**

**ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం**

ట్రెంచ్‌లను మట్టితో పూడ్చేసి ఇసుక వాహనాలను అడవిలోకి పంపిస్తున్నారు. తెల్లవారేసరికి ఇసుక తరలింపు పూర్తి చేసి, ఎవరికీ అనుమానం రాకుండా మళ్లీ ఆ మట్టిని తీసేసి ట్రెంచును యథావిధిగా మారుస్తున్నారు.

ఈ వింత దందా పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వాగుల నుండి అక్రమంగా తోడిన ఇసుకను నేరుగా తరలిస్తే దొరికిపోతామనే భయంతో, అక్రమార్కులు ఏకంగా అటవీ ప్రాంతాలనే డంపింగ్ యార్డులుగా మార్చుకున్నారు. ఇక్కడ భారీగా ఇసుకను నిల్వ చేసి, సమయం చూసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రారం, అల్లాపూర్, గట్టేపల్లి, తిమ్మనగర్ గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు ఈ తంతంగానికి పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉన్నప్పటికీ, అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు అంటున్నారు. అసలు క్షేత్రస్థాయిలో తనిఖీలే చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సంపదను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఉపేక్షించేది లేదు

**ఇంచార్జి రేంజ్ అధికారి శ్యామ్**

అటవీ ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రాత్రి సమయాల్లో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నాం. అక్రమార్కులకు సహకరించిన వారెవరైనా సహించేది లేదు. అక్రమాలకు పాల్పడిన వారి సమాచారం అందించాలి. పక్కా ఆధారాలు ఉంటే ఉన్నతాధికారులకు నివేదిక పంపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

## 90 శాతం సబ్సిడీతో

### ఎస్‌సి యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు

**24లోపు దరఖాస్తులు సమర్పించాలి**

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 19, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 కింద వివిధ పథకాలు అమలు చేయటానికి ప్రత్యేక బ్యాంకర్ల (డిసిసి)సమావేశం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో ఎస్సీ యాక్సన్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టినట్లు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ యాక్షన్ ప్లాన్ కింద ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా యూనిట్ల స్థాపన చేపట్టటానికి కార్యచరణను బ్యాంకర్ల సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. లక్ష రూపాయల విలువ గల ఎలక్ట్రిక్ ద్విచక్రవాహన యూనిట్లు 90శాతం సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గిగ్‌వర్కర్లుగా ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్ అయిన జొమాటో, స్విగ్గి, ర్యాపిడో మొదలైన వాటిలో పనిచేస్తున్న వారికి ఈ ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. రూ.3లక్షల విలువ గల గూడ్స్, ప్యాసింజర్స్ త్రీవీలర్ యూనిట్లు 70శాతం సబ్సిడీపై మంజూరు చేస్తామన్నారు. ఈ వాహనాల ద్వారా వారు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని అన్నారు. అదే విధంగా రూ.3లక్షల నుంచి రూ.7లక్షలు విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు 60శాతం సబ్సిడీపై మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించటమే లక్ష్యంగా ఏర్పాటు జరిగిందన్నారు. షెడ్యూల్డ్ కులాల రైతులు సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు ఈ పథకం కింద 215ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, 106త్రిచక్ర వాహనాల యూనిట్లు, 22సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు కేటాయించబడినట్లు ఆయన తెలిపారు. ఈ యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని బ్యాంకర్లు చురుకుగా వ్యవరించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. ఈ నెల 24వ తేదీలోపు అర్హులైన వారు ధరఖాస్తులు సమర్పించాలని, వాటిని బ్యాంకర్లు పరిశీలించి రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పూర్తి స్థాయిలో సమర్ధవంతంగ అమలు చేసి ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటానికి బ్యాంకర్లు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఈ ఎస్సీ యాక్షన్ ప్లాన్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఇడి కె.బాబుమోజెస్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ సి.శివప్రసాద్, ఎస్‌బిఐ, యుబిఐ, కెనరా, పిఎన్‌బి, టిజివిబి, బ్యాంకులకు సంబంధించి జిల్లా కంట్రోలర్లు, కోఆర్డినేటర్లు బ్యాంకర్ల సమావేశంలో పాల్గొనటం జరిగింది.



## కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 80 పోస్టుల భర్తీ

**దరఖాస్తుల స్వీకరణకు 25 వరకూ గడువు**

**కలెక్టర్ దీపక్ తివారి వెల్లడి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** కోడంగల్ లోని తెలంగాణ ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాలలో కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకుల నియామకం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్య కళాశాలలో వివిధ విభాగాలలో పూర్తిగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు ప్రొఫెసర్లు 3, అసోసియేట్ ప్రొఫెసర్లు 16, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 25, సీని యర్ రెసిడెంట్లు 23, ట్యూటర్లు 13 పోస్టుల కొరకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ధరఖాస్తులను అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ ఫోటోగ్రాఫ్‌లతో పాటు సమర్పించాలని తెలిపారు. ప్రొఫెసర్లకు నెలవారీ ఏకీకృత జీతాలు రూ. 1,90 లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.1,50 లక్షలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1,25 లక్షలు, సీనియర్ రెసిడెంట్లకు రూ.1,06,461., ట్యూటర్లకు రూ.57,700 వేతనాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పోస్టులకు సంబంధించిన స్పెషాలిటీ, డిపార్ట్‌మెంట్ వారీ ఖాళీల జాబితా కళాశాల వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడిందని తెలిపారు.

వెబ్‌సైట్ నుండి సంబంధిత దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, దానిని పూరించి, ప్రిన్సిపాల్ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలని సూచించారు. ఈమెయిల్, పోస్ట్ ద్వారా వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవని స్పష్టం చేశారు. దరఖాస్తులను కోడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. కోడంగల్ ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి పక్కన, కోకట్, హైదరాబాద్ రోడ్డు, తాండూరు, వికారాబాద్ (జిల్లా)లో 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించబడతాయని, మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్ ను సందర్శించాలని తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని..స్కూటరిస్టు మృతి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :**

అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. వేగంగా వచ్చిన బస్సు వెనకనుంచి స్కూటర్‌ను ఢీకొట్టడంతో స్కూటరిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలోని మోహదీపట్నంలో గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే..మెహదీపట్నం డిపోకు చెందిన మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టింది. బస్సు ముందు వెళ్తున్న స్కూటర్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టడంతో స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తి కిందపడిపోయాడు. అతని తలపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో స్పాట్‌లోనే చనిపోయారు. మొయినాబాద్ తాజ్ హోటల్ సమీపంలో బీజాపూర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.

## ‘వధశాల్లా నుంచి తప్పించి గోశాలకు..

**రెండు వాహనాలలో గోవులను తరలింపునకు ప్రయత్నం**

**అడ్డుకున్న విశ్వహిందూ పరిషత్ నేతలు**

**కీసర, మార్చి19, ప్రభాతవార్త :** ఆవుల అక్రమ రవాణాను విశ్వహిందూ పరిషత్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సంఘటన గురువారం కీసరలో చోటుచేసుకుంది. రెండు డిసిఎం వాహనాలలో ఆవులను తరలిస్తుండగా కీసరగుట్ట కమాన్ వద్ద వాహనాలను ఆపాలని ప్రయత్నించినప్పటికి దూకుడుగా వెళ్లిపోయాయి. ఆ తర్వాత కీసర రాఘవేంద్రహోటల్ వద్ద అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వాహనాలను కీసర పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఆవులను సమీపంలోని హైజా గోశాల లేదా జియాగూడ గోశాలకు చేరుస్తామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో కీసరలో భారీగా ట్రాఫిక్ జాం అయింది.



# ఘనంగా పరాభవనామ ఉగాది వేడుకలు


కొమురవెల్లి దేవాలయంలో పంచాంగ శ్రవణం


రామాయంపేటలో పంచాంగశ్రవణంలో లావణ్యానాగరాజు


దంతేపల్లిలో పూజాకార్యక్రమంలో సర్పంచి బాల్‌రాజ్


యూసుఫ్‌పేటలో పంచాంగ శ్రవణంలో శశిధర్‌రెడ్డి


డవ్వూర్‌లో ఉగాది ఉత్సవాల్లో చంద్రశేఖర్‌రెడ్డి


తోల్వా తండాలో ఉగాది వేడుకలు


బొమ్మారెడ్డిగూడెంలో ఉగాది వేడుకలు


ఉగాది వేడుకల్లో పాల్గొన్న వెన్నవరం ఆదర్శరెడ్డి


కేతకి ఆలయంలో చైర్మన్ చంద్రశేఖర్, ఈఓ శివరుద్రప్ప


చిలిపిచెడ్‌లో బండ్ల ఊరేగింపు


వేంకటేశ్వరుని దర్శించుకుంటున్న భూపాల్‌రెడ్డి


లకుడారంలో దేవాలయంవద్ద పంచాగశ్రవణంలో భక్తులు

**కొమురవెల్లి, మార్చి 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో తెలుగు శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను గురువారం ఘనంగానిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనం ఉగాదిపచ్చడిని సేవించారు. మండలకేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేకపూజలుచేశారు. శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో ఉగాదివేడుకలు ఆలయ అధికారి కృష్ణప్రసాద్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దేవాలయం ఆవరణలో పంచాంగాన్ని పఠించారు. ఈసందర్భంగా రేవన సిద్దేశ్వర్(సాయి) పంచాంగాన్ని చదివి రాశిఫలాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు బుద్ధి శ్రీనివాస్, రావుల సుదర్శన్, నీల శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, అర్చకులు, ఒగ్గు పూజారులు, ఆలయసిబ్బంది, భక్తులు, వేదపాఠశాల విద్యార్థులు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో..**
ఉగాదివేడుకలు మండలంలోని వివిధగ్రామాల్లో గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా అందంగా అలంకరించిన దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో పంచాంగపఠనం చేశారు. నంగునూరు, గట్లమల్యాల, అక్కెనపల్లి, ఖాత, బద్దిపడగ, నర్మెట్ట, ముండ్రాయి, పాలమాకుల, రాజగోపాల్‌పేట, సిద్దన్నపేట తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా షడ్రుచుల సమ్మేళనంగా ఉగాది పచ్చడిని పంపిణీచేశారు. కార్యక్రమాల్లో ఆయాగ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో..**
చిన్నకోడూరుమండలంలోని ఆయాగ్రామాల్లో గురువారం శ్రీపరాభవనామ ఉగాదిపండుగ ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని చిన్నకోడూరు, చంద్లాపూర్, విఠలాపూర్, మాచాపూర్, మైలారం, ఇబ్రహీంనగర్‌తో పాటు ఆయాగ్రామాల్లో పంచాయతీలవద్ద పంచాగ శ్రవణం గావించారు. ఆయాకార్యక్రమంలో సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**రామాయంపేటలో..**
**రామాయంపేట, మార్చి 19, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలో ఉగాదిని పురస్కరించుకుని గాంధీ విగ్రహం వద్ద పంచాంగపఠనం కార్యక్రమం మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యానాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ పురోహితుడు దోర్బల వెంకటేశం పంతులు సంప్రదాయబద్ధంగా పంచాంగపఠనంచేసి, నూతన సంవత్సర ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, వివిధ కులసంఘాల పెద్దలు, స్థానికప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**దంతేపల్లిలో..**
**రామాయంపేట, మార్చి 19, ప్రభాతవార్త:**
రామాయంపేటమండలం దంతేపల్లిగ్రామంలో ఉగాదిని పురస్కరించుకుని పంచాంగశ్రవణ కార్యక్రమం ఘనంగానిర్వహించారు. గ్రామసర్పంచి మస్కూరి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో గ్రామపురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొని సంప్రదాయబద్ధంగా ఉగాది పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

**యూసుఫ్‌పేటలో..**
**పాపన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:**
ఉగాదిని పురస్కరించుకొని మండలంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నార్సింగి, కొత్తపల్లి, సీతనగరం, కొడుపాక గ్రామాల్లో రాజరాజేశ్వరస్వామి, మత్తడి పోచమ్మ, పోచమ్మ దేవాలయాలకు జాతరబండ్లు తిరిగాయి. పలు గ్రామాల్లో వంచాంగశ్రవణం కొనసాగించారు. యూసుఫ్‌పేటలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, సర్పంచి అనితానరేందర్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

**డవ్వూర్‌లో..**
**మనూర్, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని డవ్వూర్‌గ్రామంలో కొలువున్న శ్రీలొంక ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాదిని వేడుకలను రాష్ట్ర కాంగ్రెస్ నేత పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డిని గ్రామస్థులు, ఆలయకమిటీ బాధ్యులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు శివాజీపాటిల్, నర్సమ్మ సిద్రం, ముకుంద్‌రెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ కౌన్సిలర్ బాణపురం రాజుముదిరాజ్, మహేశ్ చౌహాన్, షారుఖ్‌ఖాన్, శివన్న, రాజు, వెంకట్, విఠల్, మల్లేష్, అశోక్ డీలర్, శిరోమణి, అనిల్‌రెడ్డి, లింగం, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తోల్వాతండాలో..**
**సిర్గాపూర్, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని తోల్వాతండాలో నాయక్ కార్బారీలు, యువకులు, తండా వాసులు ఉగాదిని ఏడో రమేరో దన్ గోర్ సేవ సామాజిక కార్యక్రమాలు గోర్ సేవా సిర్గాపూర్ శివాజీ, గోర్ సేవా రాష్ట్ర అధ్యక్షులు జగన్‌పవార్ నేతృత్వంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తండా యువకులు హరి, గంగారాం, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**బొమ్మారెడ్డిగూడెంలో..**
**చౌటకూరు, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడెంలోని భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో ఉగాదిని పురస్కరించుకుని ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాంగశ్రవణం వినిపించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి, ఉమ్మడి మెదక్ జిల్లాగిరిజనసంక్షేమసంఘం అధ్యక్షులు జైపాల్‌నాయక్, గ్రామస్థులు దేవిదాస్, సురేందర్, గణపతి, శంకర్‌నాయక్, రవీందర్‌నాయక్, శివాజీ, సంతోష్, సంగ్య, గోపాల్, కిట్టు, రాజ్‌కుమార్, బొమ్మరాజు, శ్రీనివాస్, నర్సింలు, ప్రశాంత్, రమేష్, అశోక్, అభిలాష్, కిషన్, ప్రవీణ్, బాబులాల్, హరి, బద్రీనాథ్, సర్వన్ తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రాపురంలో..**
**రామచంద్రాపురం, మార్చి 19, ప్రభాతవార్త:**
కోకాపేట నియోపోలిస్‌లో శారదాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర మాజీ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు గోసుల శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శరెడ్డి పాల్గొని ప్రముఖులకు ఉగాదిపండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్యయాదవ్, జిన్నారం మాజీ జడ్పిటిసి సభ్యులు కొలను బాల్‌రెడ్డి, బిఆర్ఎస్వీ కో–ఆర్డినేటర్ కృష్ణకాంత్, బిఆర్ఎస్ యువనాయకులు మాణిక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఝరాసంగంలో..**
**ఝరాసంగం, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన ఝరాసంగంతోపాటు మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ఉగాదివేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రమైన ఝరాసంగంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీకేతకిసంగమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగశ్రవణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌పాటిల్, ఆలయ ఈఓ శివరుద్రప్ప, గ్రామస్థులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

**చిలిపిచెడ్‌లో..**
**చిలిపిచెడ్, మార్చి 19, ప్రభాతవార్త:**
ఉగాదిని పురస్కరించుకొని చిలిపిచెడ్ మండలవ్యాప్తంగా ఉగాదివేడుకలు వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగానే మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలు ఫైజాబాద్, చిలిపిచెడ్, అజ్జమరి, వివిధ గ్రామాలలో ఉత్సవాలలో ఎడ్లబండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామాలలోని గ్రామదేవతల చుట్టూ ప్రదక్షిణలతో బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు సోమవారం ఉదయం మరోమూడు ప్రదక్షణలు నిర్వహిస్తామని తెలిపారు.

**నారాయణఖేడ్‌లో..**
**నారాయణఖేడ్, మార్చి 19, ప్రభాతవార్త:**
ఉగాది సందర్భంగా నారాయణఖేడ్ మండలంలోని హనుమంతరావుపేటలో వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారిని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని మంగల్‌పేట్ దుర్గాభవానీమాత ఆలయంలో భవానీ మాతను దర్శించుకున్నారు.

**కొండపాకలో..**
**కొండపాక, మార్చి 19, ప్రభాతవార్త:**
ఉగాదిపండుగను కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని లకుడారం, కుకునూరుపల్లి, మేదినిపూర్, రాయవరం, బోబ్బాయిపల్లి, కొండపాక, మర్పడ్గ, సిర్సనగండ్ల, దుద్దెడ, అంకిరెడ్డిపల్లి, బందారం తదితర అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.

**లకుడారంలో..**
ఉగాదిని లకుడారం గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో పంచాగశ్రవణం నిర్వహించారు. గ్రామస్థులంతా ఒకచోట చేరి పంచాగశ్రవణం ఆలకించారు. అనంతరం ఈ నెల 27న సీతారాముల కళ్యాణం జరిపించడానికి నిర్ణయం జరిగిందని గ్రామస్థులు తెలిపారు.

## అభివృద్ధి పనుల నిర్మాణానికి సర్పంచి శ్రీకారం


సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న సర్పంచి ప్రవీణ్‌కుమార్

**న్యాల్‌కల్, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని హద్నూర్ గ్రామంలో అభివృద్ధి పనుల నిర్మాణానికి గ్రామసర్పంచి ఎంఆర్ ప్రవీణ్‌కుమార్ భూమిపూజా కార్యక్రమాలు చేసి అభివృద్ధి పనుల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. 10లక్షల రూపాయలతో మహిళాశక్తి భవనం, 5లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణానికి వార్డు సభ్యులు, గ్రామస్థులతో కలిసి ఉగాది పర్వదినాన భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు సర్పంచి శ్రీకారంచుట్టారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, వార్డుసభ్యులు మాతంశెట్టి రాజ్‌కుమార్, మంగలి మహేశ్, విజయ్, అశోక్, షబ్బీర్‌ఖాన్, మల్కప్ప, దేవప్ప, ఇందూర్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కార్‌చేతుల మీదుగా రిటైర్మెంట్ రెవిన్యూ కార్యదర్శి జన్మదిన వేడుకలు

**నారాయణఖేడ్, మార్చి 19, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట గ్రామానికి చెందిన రిటైర్మెంట్ రెవిన్యూ కార్యదర్శి మల్లయ్య జన్మదిన వేడుకలను ఎంపి సురేష్ కుమార్ శెట్కార్ నివాసగృహంలో ఆయన సోదరులైన మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శెట్కార్ చేతులమీదుగా కేకులు కట్‌చేసి శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించి జన్మదిన వేడుకలను అంగరంగవైభవంగా ఘనంగా నిర్వహించారు. వచ్చే ఏడాది కూడా ఇదేవిధంగా జన్మదినవేడుకలను సంతోషంగా ఆరోగ్యంగా ఉండి అందరిమధ్యన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని రిటైర్మెంట్ ఉద్యోగులైన మల్లయ్యకు మున్సిపల్ చైర్మన్ కోరారు.

## ఘనంగా ఉగాది సంబురాలు

**జహీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:**
ఉగాది వేడుకలను గురువారం జహీరాబాద్ పట్టణంతోపాటు మండలంలోని ఆయాగ్రామాల్లో ఘనంగాజరుపుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో వేద బ్రాహ్మణులు పంచాంగశ్రవణంచేశారు. జహీరాబాద్ వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకుని పట్టణంలోని ఆదర్శనగర్‌లోని పార్క్‌లో పట్టణ పురోహితులు డాక్టర్ గిరీష్‌జోషి పంచాంగశ్రవణం చేశారు. కార్యక్రమంలో వికాసతరంగిణి అధ్యక్షులు అల్లాడి వీరేశం, సభ్యులు సాయివిఠల్‌రెడ్డి, శేషరావు, దత్తురెడ్డి, విజయలక్ష్మి, ఉమా మహేశ్వరరావు, శ్రీవాణి శ్రీశైలం, పాండురంగారెడ్డి, విజేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో...**
రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను జహీరాబాద్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణ పురోహితులు వెంకట్‌జోషి పంచాగశ్రవణం చేశారు.

**సన్మానాలు అందుకున్న విద్యార్థులు...**
సిఏ విద్యాభ్యాసం పూర్తిచేసిన కల్వ హారిక, ఉస్మానియా ఆసుపత్రిలో డిఎంగా వైద్యరంగంలో కార్డియాలజిస్ట్‌గా సేవలు అందించిన డాక్టర్ కోట్రిక్ అనిల్ కుమార్‌లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బెజుగం రాజగోపాల్, నామ రవి కిరణ్, నీలా వెంకటేశం, బండబీది రాములు, కల్వ చంద్రశేఖర్, మాడిశెట్టి శ్రీనివాస్, పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కాశీవిశ్వేశ్వరుని ఉత్సవాలు


చౌటకూరులో కాశీవిశ్వేశ్వర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తుల దృశ్యం

**చౌటకూరు, మార్చి 19, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులో శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవాలు పరాభవ నామ సంవత్సరం (ఉగాది)ను పురస్కరించుకుని గురువారం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజైన గురువారం ధ్వజారోహణం, అభిషేకంతో ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు తీర్థాల రామకృష్ణ పంచాంగశ్రవణం చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆనవాయితీగా వస్తున్న పోసానిపల్లి గ్రామం నుంచి పెద్ద ఎడ్లబండి, సరాఫ్‌పల్లి నుంచి మరో ఎడ్లబండిని అందంగా అలంకరించుకుని ఉత్సవాలకు చేరుకోవడంతో చౌటకూరు, సరాఫ్‌పల్లి గ్రామాల సర్పంచులు పార్కల రాంరెడ్డి, రామచంద్రారెడ్డిలు గ్రామస్థులతో కలిసి సాదరంగా స్వాగతం పలికారు. గ్రామంలోని 19 ఎడ్లబండ్లు సైతం ఆలయానికి చేరుకుని 21 ఎడ్లబండ్లు ఆలయం చుట్టూ తిప్పి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

**ఉమ్మడి మండలంలో ఘనంగా ఉగాది వేడుకలు...**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం పరాభవనామ నూతన సంవత్సర (ఉగాది) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఇళ్లను మామిడి తోరాణాలు, రంగు రంగు పూలతో అందంగా అలంకరించుకుని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లో వేదపండితులు పంచాగశ్రవణం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పచ్చడిని సేవించి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## గ్యాస్ కష్టాలు.. కళ్లకు 'కట్టె' నట్టు


కట్టెల పొయ్యిమీద టిఫిన్‌లు చేస్తున్న రవికుమార్

**చిన్నశంకరంపేట, మార్చి 19, ప్రభాతవార్త:**
యుద్ధ ప్రభావంతో గ్యాస్ కష్టాలు సామాన్యుడికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్యాస్ దొరకదేమోనన్న భయంతో మండలంలో చాలామంది కట్టెలపొయ్యిలను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడికక్కడ కట్టెలు, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు. చాలా హోటళ్లు మూతపడ్డాయి. రంజాన్, ఉగాది పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో గ్యాస్ కొరతతో చాలామంది అవస్థలు పడుతున్నారు. చిన్నశంకరంపేట పట్టణానికిచెందిన వీధివ్యాపారి సిరిగద్దె రవికుమార్ నేత చిన్న టిఫిన్ సెంటర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. గ్యాస్‌కోసం ఎక్కడ తిరిగినప్పటికీ దొరకకపోవడంతో గత్యంతరంలేక కట్టెలపొయ్యిని వాడుకొని టిఫిన్ సెంటర్‌ను నడిపిస్తున్నాడు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగిస్తే అధికారులు తనిఖీలు చేసి పట్టుకోవడంతో హోటల్ వ్యాపారం కుదేలవుతుంది. అధికారులు గ్యాస్‌కొరత లేదంటున్నారు. కాని ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ ఎందుకు ఇవ్వటంలేదని ప్రశ్నిస్తున్నారు. గ్యాస్‌కష్టాలతో వ్యాపారులకు కట్టెదు దుఃఖం మిగులుతుంది.

## కీ.శే.లచ్చమ్మ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్


బహుమతులు అందజేస్తున్న నిర్వహకులు

**చిలిపిచెడ్, మార్చి 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో కీ.శే. బేగరి లచ్చమ్మ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్లో నాలుగు టీములు తలపడి నాలుగు మ్యాచ్‌లు ఆడగా, రెండు టీంలు ఫైనల్‌కు చేరాయి. ఒకటి సన్రైజర్స్ అజ్జమర్రి, రెండోది ఆర్సీబి అజ్జమర్రి, విన్నర్గా సన్రైజర్స్ గెలుపొంది మొదటి బహుమతి రూ.6000 నగదును అందుకుంది. రన్నర్‌గా ఆర్సీబి నిలిచి రూ.4000 రూపాయలు గెలుచుకుంది. కార్యక్రమంలో గ్రామసర్పంచి యశోదబిక్షపతి, మాజీసర్పంచి పరశురాంరెడ్డి, వార్డుమెంబర్లు మైపాల్, సురేష్, సురేందర్‌రెడ్డి, పాపయ్య, శ్రీనివాస్‌గౌడ్, సతీష్, యాదయ్య, యువకులు తదితరులు భారీగా పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన హరీశ్‌రావు


టైగర్ నర్సమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

**సిద్దిపేట అర్బన్, మార్చి 19, ప్రభాతవార్త:**
సిద్దిపేటలో మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు గురువారం పలువురు బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. సిద్దిపేట అర్బన్ మండలపరిధిలోని బక్రిచెప్యాలలో వెలుగు ఎపిఎం అంజనేయులు తండ్రి మరణించగా, బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అలాగే అదేగ్రామంలో విజయ్ తండ్రి బిఆర్ఎస్ నాయకురాలు నర్సమ్మ భర్త రాజయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సిద్దిపేట పట్టణ బిఆర్ఎస్ మహిళావిభాగం అధ్యక్షురాలు టైగర్ నర్సమ్మ మృతిచెందడంతో బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. టైగర్ నర్సమ్మ మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. అలాగే సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుదీర్ఘకాలం తెలుగు ఉపన్యాసకులుగా సేవలందించిన గోపాల్‌రెడ్డి మృతిపట్ల సంతాపం తెలిపారు. ఆయనవెంట ఎమ్మెల్యే దేశపతి శ్రీనివాస్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## శ్రీసీతారాముని కళ్యాణ ఆహ్వానపత్రిక


ఆహ్వాన పత్రికను వేద బ్రాహ్మణులతో పెట్టిస్తున్న గ్రామ సర్పంచి

**కౌడిపల్లి, మార్చి 19, ప్రభాతవార్త:**
శ్రీరంగంపేట పీఠాధిపతి మాధవానందసరస్వతీస్వామి ఆదేశాల మేరకు శ్రీపరాభవనామ సంవత్సరాన్ని పురస్కరించుకొని కౌడిపల్లిగ్రామ సర్పంచి చంద్రం క్రిష్ణాగౌడ్, ఉపసర్పంచి, గ్రామపెద్దల సమక్షంలో కౌడిపల్లి గ్రామ శ్రీఅభయరామాలయ 33వ వార్షికోత్సవ వేడుకలతోపాటు శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణం నిర్వహించుటకుగాను వేదపండితుల నడుమ ఆహ్వానపత్రికను ఘనంగా రాయించడం జరిగింది. శ్రీరామనవమిసందర్భంగా ఆలయంలో మూడురోజులపాటు ఉత్సవ వేడుకలను ఘనంగా జరుపబోతున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచితోపాటు ఉపసర్పంచి శ్వేతా మల్లికార్జునగౌడ్, గ్రామపెద్ద చిలుముల దుర్గారెడ్డి, మహమ్మద్‌నగర్ సొసైటీ సిఈవో దుర్గయ్యగౌడ్, గ్రామపెద్దలు చంద్రం దుర్గాగౌడ్, పిస్కె శేట్టయ్య, పోల నవీన్, మఠూరి శాకయ్య, పుండరీకంగౌడ్, సత్యనారాయణగౌడ్, పోన్నం మనోహర్‌గౌడ్, రాగుల భూమయ్య, కిషోర్‌గౌడ్, దర్జి చంద్రం, మల్లేశం, ఉడుత వెంకటేశంగుప్తా, గొల్ల శ్రీనుయాదవ్, గుడ్డంల వెంకటేశం, సంధ్యగల క్రిష్ణా, మల్లేశం, కౌడ శ్రీనివాస్‌గుప్తా, ఉడుత రాజు, మురళినాయక్, పురోహితులు, ఆలయం పురోహితులు ఫణింద్రశర్మ, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గన్యాతండాలో నీటిసమస్యకు శాశ్వత పరిష్కారం

**చిలిపిచెడ్, మార్చి 19, ప్రభాతవార్త:**
ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గన్యాతండా సర్పంచి గుగ్లోత్ నీలా పాండునాయక్ గ్రామప్రజలకు ఉపశమనం కలిగించేవిధంగా కీలకచర్యలు చేపట్టారు. గ్రామంలో తీవ్రంగా నెలకొన్న నీటిసమస్యను పరిష్కరించేందుకు తక్షణమే స్పందించి కొత్త బోర్‌మోటార్‌ను ఏర్పాటు చేయించారు. స్థానిక వార్డుసభ్యులు గ్రామంలో నీటికొరతను సర్పంచి దృష్టికి తీసుకురావడంతో, సమస్యను ఆలస్యం చేయకుండా పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. బోర్‌మోటార్ అమరిక పనులు వేగంగా పూర్తి చేయడంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించింది. కార్యక్రమంలో వార్డుసభ్యులు, తండాప్రజలు పాల్గొన్నారు. నీటిసమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు గ్రామప్రజలు సర్పంచి పాండునాయక్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.